క్లుప్తంగా

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



కారేపల్లి హైస్కూల్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. కారేపల్లిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, కారేపల్లి హైస్కూల్, మోడల్ స్కూల్, నిర్మలా హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించగా.. వివిధ ప్రాంతాల నుంచి 1,042మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కోలాహలం నెలకొంది.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు నాగరాజు



ప్రధాన కార్యదర్శి మహేష్

కల్లూరు: కల్లూరులో లారీ అండ్ డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా మాడిశెట్టి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బోడా మహేష్, సహాయ కార్యదర్శిగా సగ్రాబు సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎండీ రబ్బానీ పాషా, కోశాధికారిగా కేవీ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా జి.నరేష్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కే ఉస్మాన్, ఎస్‌కే తురాబ్‌అలీ, పాశం నరసింహారావు, గుండ్ల కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడిగా నీలం వెంకట్రావ్, పి.కోటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎంఎస్ రాజు, డి.మురళీకృష్ణలు ఎన్నికయ్యారు.

నరేందర్‌రెడ్డికి అభినందన



తల్లిదండ్రులతో డాక్టర్ వంశీ నరేందర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శీలం వెంకట్రామిరెడ్డి–జయలక్ష్మి(ఎంపీటీసీ) దంపతుల కుమారుడు శీలం వంశీ నరేందర్‌రెడ్డి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేశారు. శనివారం రాత్రి కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. మారుమూల గ్రామం నుంచి రైతు కుటుంబంలో జన్మించి డాక్టర్ విద్యను పూర్తి చేసిన వంశీ నరేందర్‌రెడ్డిని పలువురు అభినందించారు. చిన్నతనం నుంచే విద్యలో మంచిమార్కులు సాధించి డాక్టర్‌గా తమ కుమారుడు ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ వంశీ నరేందర్‌రెడ్డి తల్లిదండ్రులు స్థానిక విలేకరులకు వెల్లడించారు. పీజీ విద్యను కూడా పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తన ఆకాంక్ష అని డాక్టర్ వంశీ నరేందర్‌రెడ్డి తెలిపారు.

రేపు పాఠశాల వార్షికోత్సవం

వైరా: ఈ నెల 9 వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాడెంట్ పోతినేని భూమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రజా కవి గొడిసెల జయరాజు, ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత హాజరవుతారని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు వార్షికోత్సవ సభ ప్రారంభమవుతుందని తెలిపారు.

తండ్రికి దహన సంస్కారాలు చేసిన కుమార్తెలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తెలు

మధిరరూరల్: మండల పరిధిలోని మాటూరు పేట గ్రామానికి చెందిన బొమ్మెన పెద్ద వెంకటేశ్వర్లు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు కుమారులు లేకపోవడంతో తన ముగ్గురు కుమార్తెలైన చిలువేరు పూర్ణమ్మ, పారల లక్ష్మి, తిగుళ్ల జ్యోతి హిందూ శాస్త్ర ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించారు.

చిక్కినా.. దొరకరు..!

- సత్తుపల్లిలో చెలరేగిపోతున్న దొంగలు
- వరుస చోరీలతో జనం బెంబేలు
- బైకుల చోరీలకు బ్రేకే లేదు..





రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో వివరాలను సేకరిస్తున్న సీఐ కిరణ్ (ఫైల్)



ముఖానికి దస్తీ కట్టుకొని మోటారు సైకిల్ తీసుకెళ్తున్న నిందితుల సీసీ ఫుటేజీ (ఫైల్)

సత్తుపల్లి: చోరీలు చేస్తున్నట్టు సీసీ కెమెరా ఫుటేజీలలో స్పష్టంగా కన్పిస్తున్నారు.. కదలికలను పరిశీలిస్తే ప్రొఫెషనల్ దొంగల్లా ఉన్నారు.. వారి పనితనాన్ని చూసి నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అయితే, ఎన్నో క్లిష్టమైన కేసులను ఛేదించిన సత్తుపల్లి పోలీసులకు ఈ దొంగతనాలు సవాల్‌గా మారాయి. దొంగలను దొరకబుచ్చుకునేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా.. ముఖానికి దస్తీ కట్టుకుని దర్జాగా చోరకళను ప్రదర్శిస్తుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది. పోలీసులు, క్లూస్ టీమ్స్ రంగప్రవేశం చేసినా దొంగలను పట్టుకోవడంలో సఫలం కాకపోవడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

సీసీ ఫుటేజ్ ఎత్తుకెళ్లారు..

సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులోని పాత, కొత్త సొసైటీ కార్యాలయాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం, అన్నపూర్ణ మెస్‌లలో గత గురువారం అర్ధరాత్రి వరుసగా చోరీలు జరగడం ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. పాత సొసైటీ కార్యాలయంలో తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చిందరవందర చేసి ఏమీ దొరకక వదిలేసి వెళ్లారు. కొత్త సొసైటీ భవనం వెనుకభాగంలోని మెట్లపై నుంచి వచ్చి కిటికీ గ్రిల్స్ తొలగించి సొసైటీ కార్యాలయంలోకి వెళ్లి బీరువా తలుపును గడ్డపలుగుతో కోసినట్లు పగులగొట్టినా ఏమీ దొరకలేదు. అదే కాంప్లెక్స్‌లో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బులెట్ షోరూంలో అద్దాలు పగులగొట్టి లోన కౌంటర్‌లోని రూ.10వేలు ఎత్తుకెళ్లారు. ఇదేసమయాన సీసీ ఫుటేజ్ హార్డ్‌డిస్క్ సైతం ఎత్తుకెళ్లారు. దీని ఎదురుగా ఉన్న అన్నపూర్ణ మెస్ షెట్టర్ తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి కౌంటర్‌లో సుమారు రూ.10వేలు దొంగలించి కౌంటర్‌పై ఉన్న సీసీఫుటేజ్ హార్డ్‌డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. కాగా సీసీ ఫుటేజ్‌ల్లో తమ ముఖాలు నమోదైతే పోలీసులు పట్టుకునే అవకాశమున్నందున ఏకంగా సీసీ ఫుటేజ్‌లు, హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

చోరీల్లో కొన్ని..

- గతేడాది నవంబర్ నెల 21వ తేదీన విద్యానగర్ రోడ్‌లోని రతికంటి ప్రభాకర్‌రావు పుణ్యక్షేత్రాలకు వెళ్లితే 260 గ్రాముల బంగారు నగలు(సుమారు రూ.20లక్షలు), కేజీన్నర వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. ఈ కేసులు ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు.
- గతేడాది సెప్టెంబర్ 23న సత్తుపల్లి బైపాస్‌రోడ్‌లోని మారుతిబంగారు వీధిలో నివాసం ఉంటున్న జామెమసీద్ ఉద్యోగి ఎస్‌కె జాని తెల్లవారుజామున లేచి మసీద్‌కు వెళ్లితో ఆ సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.50వేల నగదు, 7 కాసుల బంగారునగలు ఎత్తుకెళ్లారు. ఇలా సత్తుపల్లిలో జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

మోటారు సైకిళ్లు అయితే..

సత్తుపల్లి పట్టణంలో ఆరు నెలల వ్యవధిలో మోటారు సైకిల్ చోరీలు పదుల సంఖ్యలో జరగటంతో బాధితుల్లో ఆందోళన వ్యక్తమౌతుంది. ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోగానే హీరోహోండా గ్లామర్ బండిని దొంగలు ఎత్తుకుపోయారని ఓ టీచర్ ఫిర్యాదు. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పార్క్ ఉదయం చూసుకునేసరికి ద్విచక్రవాహనాన్ని నెట్టుకుంటూ వెళ్తున్న ఇద్దరు సీసీ కెమెరాలో నమోదైనా ఇంకా వాహనం జాడ దొరకలేదు.బస్టాండ్‌లో ఓ వ్యక్తి దిపేందుకు వచ్చి తాళం వేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని క్షణాల్లో మాయం చేశారని మరో వ్యక్తి ఆవేదన. ఇంటిలోపల గేటుకు తాళం వేసి ఉన్నా.. స్కూటీని గేటుపై నుంచి ఎత్తుకెళ్లారని మరో బాధితుడి ఫిర్యాదు. ఇక మసీద్‌రోడ్ ఆస్పత్రి ముందు హోండాషైన్ వాహనాన్ని పార్క్ చేసి లోపలకు వెళ్లి వచ్చేలోపు మొఖానికి దస్తీ కట్టుకొని వచ్చి మరీ దర్జాగా దొంగిలించుకుని వెళ్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. ఇలా చెప్పుకుంటూ పోతే ద్విచక్రవాహనాల చోరీలకు అడేలేకుండా పోతుందని ప్రజలు భయకంపితులవుతున్నారు. పట్టణంలో ద్విచక్ర వాహనం ఎక్కడ పెట్టినా రక్షణ కరువైందనే ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కేసులను ఛేదిస్తున్నాం..

సత్తుపల్లిలో గురువారం రాత్రి నాలుగు చోరీలు జరిగాయి. దీంతో క్లూస్‌టీమ్ రంగంలోకి దింపి ఆధారాలు సేకరించాం. మరోపక్క మోటారు సైకిల్ దొంగతనాల కేసుల పరిశోధనలో వేగం పెంచాం. నిందితుల గుర్తింపు ఓ కొలిక్కి వచ్చింది. త్వరలోనే కేసులను ఛేదిస్తాం..

– టి.కిరణ్, సత్తుపల్లి సీఐ

ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితుల ఆందోళన



తులసీరాం ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

రూ.2 కోట్లు కాజేసిన వ్యక్తి బంధువును నిలదీసిన బాధితులు

కారేపల్లి: ఉద్యోగాల పేరుతో రూ.2 కోట్లు గోల్‌మాల్ చేసిన కేసులో నిందితుడిని కారేపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి విదితమే. కాగా.. మధ్యవర్తిగా ఉన్న, నిందితుడి బావ అయిన పోలంపల్లి గ్రామానికి చెందిన తులసీరాం ఇంటి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇటీవల మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి సుమారు రూ.2 కోట్లు కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. కాగా.. నిందితుడు ప్రేమ్‌కుమార్ బావ అయిన, పోలంపల్లి గ్రామానికి చెందిన తులసీరాం బాధితులకు మధ్యవర్తిగా ఉన్నాడని, పెద్దమనుషుల సమక్షంలో ఆదివారం పోలంపల్లి గ్రామంలో బాధితులు పంచాయతీ నిర్వహించారు. పోలంపల్లికి చెందిన గుగులోతు రమేశ్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉద్యోగం ఇప్పిస్తానని ప్రేమ్‌కుమార్ రూ.63 లక్షలు, కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని అజ్మీర దివ్య నుంచి రూ.17 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగాలు వచ్చాయని.. ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో జాయిన్ కావొద్దని, నెల నెల జీతం వస్తుందని నమ్మబలికి.. కొన్ని నెలల వరకు వారిద్దరికి వేతనం ఇచ్చాడు. దీనికి సంబంధించి పెద్దమనుషుల సమక్షంలో దఫాలవారీగా పంచాయతీ నిర్వహించగా.. గుగులోతు రమేశ్‌కు రూ.38 లక్షలు, అజ్మీర దివ్యకు రూ.17 లక్షలు ఇవ్వనున్నట్లు తేలింది. కాగా.. మధ్యవర్తిగా ఉన్న తులసీరాంను మిగిలిన పైకం చెల్లించాలని ఒత్తిడి తేవటంతో.. రమేశ్‌కు రూ.10 లక్షలు, దివ్యకు రూ.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీనికి బాధితులు నిరాకరించి, బాధిత కుటుంబ సభ్యులంతా తులసీరాం ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్‌ఐ రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని.. ఆందోళనకారులకు సర్దిచెప్పి, తులసీరాంను కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు



రక్తదానం చేస్తున్న యువకులు

సత్తుపల్లిరూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రిన్సిపాల్ జోష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం కాపాడుకునేందుకు వ్యాయామం, యోగ, మెడిటేషన్ వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకూడదని విద్యార్థులు 'నా ఆరోగ్యం నా హక్కు' అనే స్లోగన్స్‌తో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ పీఓ వెంకటేష్, అధ్యాపకురాలు గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం

వైరా: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వైరాలోని మార్పు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మధు విద్యాలయం విద్యార్థిని పాపగంటి అక్షర ఈ శిబిరాన్ని ప్రారంభించగా.. యువతీ యువకులు రక్తదానం చేశారు. మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ.. వేసవిలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం దొరక్క ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారికోసమే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, జీవిరామన్, నాగరాణి, వీణాకుమారి, కృష్ణార్జునరావు, ప్రేమ్‌కుమార్, ప్రేమ్‌చంద్, వెంకటేష్, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

కల్లూరు: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు.. ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆదివారం కల్లూరులోని జామియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ పాల్గొన్నారు. అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరులోని షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌రావు, ఎస్‌కే యాకూబ్ అలీ, రెస్‌కే ఉస్మాన్, ఎస్‌కే తురాబల్లి, ఉబ్బన గోపాలస్వామి, బైర్ల కాంతారావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, దారా రంగా, ఆళ్ళకుంట నరసింహారావు, లక్కినేని రమేష్, శీలం బ్రహ్మారెడ్డి, ఇజ్జగాని శ్రీలత, దేవరపల్లి వెంకటేశ్వరరావు, వనుకూరి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు సృజన పురస్కారాలు



గాదె సత్యం



గంగుల బాబు

సత్తుపల్లిటౌన్: ప్రతిఏటా ఉగాది సందర్భంగా ప్రముఖులకు ఇచ్చే సృజన సాహితీ సమాఖ్య జీవన సాఫల్య పురస్కారాలకు 2023–24 సంవత్సరానికిగాను సత్తుపల్లికి చెందిన ప్రముఖులు గంగుల బాబు, గాదె సత్యంలకు అందజేయనున్నట్లు సృజన నిర్వాహకులు ప్రకటించారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగు, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు శాసన లిపిపై అవగాహన కలిగిన సాహితీవేత్త గంగుల బాబు 2023వ సంవత్సరపు పురస్కారానికి ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా 2024 సంవత్సరానికి సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన గాదె సత్యంకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరిద్దరి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వారి ఇళ్ల వద్దనే సోమవారం రాత్రి పురస్కారాలు అందజేసి గౌరవిస్తామని నిర్వాహకులు గట్టే వాసు, ఆడమ్స్, రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు, నాగేశ్వరరావు తెలిపారు.

అచ్చెయ్య మృతి పార్టీకి తీరనిలోటు



అచ్చయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంకు చెందిన సీనియర్ సీపీఐ నాయకుడు మణిగె అచ్చెయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. అమ్మపాలెం గ్రామానికి చెందిన అచ్చెయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు పోటు ప్రసాద్, యర్రా బాబు, తాళ్లపల్లి కృష్ణ సందర్శించి మృత దేహంపై ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. పాత ఖమ్మం తాలూకాలో సీపీఐ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన అచ్చయ్య సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంపటి పరశురాములు, జీవీఎల్ నారాయణ, నరసింహారావు, ఆర్‌టీసీ వెంకటేశ్వరరావు, తాళ్లపల్లి కృష్ణ, దారగానిరాములు, ఖాదర్‌బాబు తదితరులు ఉన్నారు.

'గుంత'తో ప్రమాదమే..



ప్రధాన రహదారికి, స్కూల్, కళాశాలకు సమీపంలో తీసిన గుంత

ముదిగొండ: మండలకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో గుంతతవ్వి ఏళ్లు గడుస్తున్నా, పట్టించుకున్న పాపాన ఏ అధికారికి కానీ, ప్రజాప్రతినిధికి కానీ తోచలేదు. ఇది జెడ్పీఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సమీపంలోనే ఉంది. ముదిగొండ–న్యూలక్ష్మీపురం ప్రధాన బీటీ రహదారికి మూడు దారులకు మూలమలుపులో ఉంది. లోతైన గుంతతో వాహనదారులకు, చిన్నారులకు ప్రమాద భరితంగా పొంచి ఉంది. దీనికి పక్కనే మంచినీటి బోరు ఉంది. ఇంగుడు గుంతకు తీసిన ఆనవాళ్లు కనిపిస్తుంది. కాని మంచినీటి బోరు వద్ద వినియోగించిన తరువాత వృథా నీరు ఇంకుడు గుంతలోకి వెళ్లితే మంచినీటి సమస్యలకు కొంత ఊరట ఉంటుంది. వేసవిలో ఇంకుడు గుంతలకు మంచి అవకాశం. ఇలా బోరు వద్ద ఇంత పెద్ద గుంత తీసి వదిలేయడంతో పలువురు ఉపాధ్యాయులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే దానిని ఇంకుడు గుంతగా మార్చి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: మండల పరిధిలోని రాయమాదారం 11కేవీ పరిధిలోని సోమవారం విద్యుత్ కోతలు విధిస్తున్న ఏఈ ఉమకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. రాయమాదారం, ఎర్రబొడుతండ, రాజలింగాల, బురదరాఘవాపురం, పికె బంజరా, పెనంపల్లి తండ, కొదండరామపురం తండా పరిధిలో విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు తెలిపారు.

లయన్స్‌క్లబ్ వితరణ



కుట్టుమిషన్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు సతీమణి సరిత పుట్టిన రోజును పురస్కరించుకుని మధిర మండలం మోటమర్రికి చెందిన జ్యోతి అనే మహిళకు కుట్టుమిషన్ అందజేశారు. అదే విధంగా రోడ్డు పక్కనే వ్యాపారం నిర్వహిస్తున్న జగదీష్ అనే యువకుడికి ప్రత్యేకంగా తయారు చేయించిన గొడుగును అందించారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, డాక్టర్ శ్యాంబాబు, ప్రభాకర్, డాక్టర్ కృష్ణమూర్తి, చింతోజు నాగేశ్వరరావు, మాదినేని సునీత, సురేష్, రాము, రాంగోపాల్, శ్రీనివాసరావు, శ్రీధర్, హనుమాయమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిర: మధిర, ఎర్రుపాలెం మండలాల్లో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు పర్యటన విజయవంతం చేయాలని ఆ పార్టీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 న ఉదయం 7 గంటలకు ఎర్రుపాలెం, జమలాపురం గ్రామాల్లో బీజేపీ పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోదరావు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం మధిర మండలం మల్లవరం గ్రామంలో ప్రచారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, జిల్లా నాయకులు కొండ హరీష్, పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, మన్ కి బాత్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల స్వర్ణాకర్, యువమోర్చ జిల్లా కార్యదర్శి కారంగుల మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి బియ్యవరపు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఆనందరావు(ఫైల్)

మధిరరూరల్: మండలంలోని నిధానపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, అల్లూరు గ్రామానికి చెందిన బిజ్జం ఆనందరావు(55) హైదరాబాద్‌లో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్తున్నానని ఈ నెల 6న కుటుంబ సభ్యులకు చెప్పి బ్యాగులో పచ్చల్లతో ఇంటి నుంచి బయలుదేరాడు. దెందుకూరు నుంచి మీనవోలుకు వెళ్లే పాత బీటీ రోడ్డు సమీపంలో ఉన్న సుబాబుల్ తోటలో మృతదేహం ఉన్నట్లు ఆ ప్రాంత రైతులు గమనించి.. విషయాన్ని మధిర రూరల్ ఎస్సై లక్ష్మి భార్గవికి సమాచారం అందించారు. ఆదివారం ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహానికి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక వివాహేతర సంబంధం నేపథ్యంలో అతడిని హత్య చేశారా అనే విషయం విచారణలో తెలియాల్సి ఉంది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఇంతేనా!

నిరుపయోగంగా సీతానగరం ఎత్తిపోతల పథకం

- పనిచేయని విద్యుత్ మోటార్లు
- లీక్ అవుతున్న పైపులైన్లు
- పట్టించుకోని అధికారులు
- సాగు నీటికోసం రైతుల కష్టాలు



నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం



తుప్పు పట్టిన మోటార్లు, రంధ్రం పడిన ఇనుప గొట్టం

బోనకల్: మండలంలోని సీతానగరం గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం అధికారుల నిర్లక్ష్యంతో 10 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎత్తిపోతల పథకాన్ని ఆనాటి మధిర ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు రైతులకోసం సీతానగరం పెద్దవాగుపై నిర్మించాడు. దీనిక కింద 280ఎకరాల భూమి సాగవుతుంది. 1160మీటర్ల మేర నీటి సరఫరా కోసం పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఈ పథకానికి 3 మోటార్లు అమర్చినా.. ఎగువభాగానికి నీరు సరఫరా కాలేక పగిలిపోతున్నాయి.

తరచూ పగిలిపోతున్నాయి..

లిఫ్ట్ ఇనుప గొట్టం తుప్పుపట్టి చిల్లులు పడింది. విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. దీంతో రైతులు డబ్బులు వేసుకొని మరమ్మతులు చేయించినా ఉపయోగం లేదు. ఈ క్రమంలో అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. కొంత మంది రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలు పండిస్తుండగా.. పేద రైతుల భూములు బీళ్లుగా మారుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


ఇబ్బందులు పడుతున్నాం..



లిఫ్టుకింద 2.50 ఎకరాల భూమి ఉంది. లిఫ్ట్ పనిచేయక పోవడంతో సాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాగాణికి ప్రతిరోజు నీరు అవసరం కావడంతో వాగుపై ఆయిల్ ఇంజన్ ద్వారా నీరు పెట్టుకోవాల్సి వస్తుంది. డీజిల్ ధర అధికంగా ఉండడంతో పండిన పంట గిట్టుబాటు కావడం లేదు.

– కటారు నాగేశ్వరరావు, రైతు

సొమ్ము వృథా అవుతోంది..



లిఫ్టుకు మరమ్మతులు చేయించక పోవడంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఎత్తి పోతల పథకం నిరుపయోగంగా మారి సొమ్ము వృథా అవుతుంది. విద్యుత్‌మోటార్లు కాలిపోయి వాడక పోవడంతో తుప్పు పట్టి పోతున్నాయి. అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోయాం. లిఫ్టుకు మరమ్మతులు చేయించాలి.

– కటారు కృష్ణయ్య, రైతు